

## ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీని వేగంగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

నారాయణపేట, జూన్ 27 (వుదయం ప్రతినిధి):

జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాలలో ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీని వేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. శనివారం ఆమె ఉట్కూర్ మండల కేంద్రంలో ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. స్థానిక కార్గిల్ చౌరస్తా, గ్రామ పంచాయతీ కార్యాలయాల సమీపంలో గల నివాసాలకు వెళ్ళి ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో బోగస్ ఓట్లను మాత్రమే తొలగించడం జరుగుతుందని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించే ప్రసక్తే లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇంటింటికి వచ్చే బీఎల్ వో లకు ఓటర్లు సహకరించి, ఎన్యుమరేషన్ పత్రాలను తప్పక పూరించి ఇవ్వాలని ఆమె సూచించారు. ఎన్యుమరేషన్ పత్రాలను ఓటర్లు త్వరగా నింపేటట్లు బీ ఎల్ వో లు, బీ ఎల్ ఏ లు చొరవ తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అశోక్ కుమార్, ఎంఈ వో మాధవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి



- ఐదుగురు అరెస్టు,...
- రూ.11,230 నగదు, ఐదు ఫోన్లు స్వాధీనం....
- శివ్వంపేట ఎస్సై మధుకర్ రెడ్డి ...

వుదయం న్యూస్ శివ్వంపేట, జూన్ 27 ....

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గంగాయిపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నట్టు స్థానిక ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం చాకచక్యంగా దాడి నిర్వహించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నామని అన్నారు. అరెస్టైన వారిలో ఇటిక్యాల రేవంత్ రెడ్డి, బానోత్ కంద్యా, నల్ల పేరమాన్లు, జిట్ట సత్యనారాయణ, ఎ. ప్రశాంత్ లు ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.11,230 నగదుతో పాటు ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగుతోందని, శాంతిభద్రతలకు భంగం కలిగించే ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో జరిగే అక్రమ కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ ధర్మయ్య, కానిస్టేబుల్ శేఖర్, హోంగార్డ్ వీరస్వామి తదితరులు ఉన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- కలెక్టర్ కే. హైమావతి
- సీజనల్ వ్యాధులు రాకుండా పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశం
- వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ విస్తృత స్థాయి సమీక్ష

సిద్దిపేట, జూన్ 27 (వుదయం బ్యూరో)



జిల్లాలో వివిధ ప్రభుత్వ పథకాల అమలు, గ్రామీణాభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. శనివారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని (కలెక్టరేట్) సమావేశ మందిరంలో ఎంపిడిఓలు, ఎంపీఓలు, ఏపిఎంలు, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, హౌసింగ్ ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో కలెక్టర్ విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ కింద మంజూరైన వీడీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు వేగంగా పూర్తి చేయాలన్నారు. అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ వచ్చిన వెంటనే మాస్టర్ జనరేట్ చేసి పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ కూలీల శాతం పెంచాలని, రానున్న వనమహోత్సవ కార్యక్రమం కోసం గుంతలు తీసి సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓలను ఆదేశించారు.

**సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు**

వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. డ్రైనేజీలను క్రమబద్ధంగా శుభ్రం చేయాలి. పాత సామాగ్రి, టైర్స్‌లపై మురుగునీరు నిల్వ ఉండి దోమలు లార్వా పెట్టకుండా చూడాలి. ప్రతి గ్రామంలో బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ మిషన్ మెటీరియల్ అందుబాటులో ఉంచాలి. డెంగ్యూ, చికెన్ గున్యా లాంటి వ్యాధులు రాకుండా ఇంటి పరిసరాల పరిశుభ్రత, ఆహార అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలి. సీజనల్ వ్యాధులను అరికట్టడంలో వైద్య ఆరోగ్య శాఖ కంటే పంచాయతీ అధికారుల బాధ్యతే ఎక్కువని ఆమె పేర్కొన్నారు.

**ఆర్థిక నిధులు - మిషన్ భగీరథ**

గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రాధాన్యత కలిగిన పనుల కోసం 100 శాతం వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. మిషన్ భగీరథ మేజర్, మైనర్ రిపేర్లు, కొత్త కనెక్షన్ల కోసం గ్రామ పంచాయతీ నిధులను వాడుకోవాలని, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడానికి నిచ్చెనలు, పైన కప్పులు అమర్చుకోవాలని సూచించారు. జిల్లా పరిషత్ నిధుల కింద మంజూరైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు, సబ్‌సెంటర్ల మైనర్ రిపేర్లను త్వరగా పూర్తి చేయాలన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లకు ప్రాధాన్యత**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటివరకు 6,481 స్లాబ్‌లు పూర్తయ్యాయని, మిగతా ఇళ్ల నిర్మాణాలను కూడా వేగవంతం చేయాలని హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సంవత్సరం నియోజకవర్గానికి 2 వేల ఇళ్లు కేటాయించినట్లు పేర్కొంటూ.. ఇల్లు లేని లబ్ధిదారులు, పూరి గుడిసెల్లో నివసించే వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు. భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఇంటికీ ఇంకుడుగుంత, పొలాల్లో పంట గుంతలు నిర్మించేలా చర్యలు చేపట్టాలన్నారు.

**హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలు**

ఈ సమీక్షా సమావేశానికి ముందు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెర్ప్ దివ్యాంగుల అభివృద్ధి కార్యక్రమం కింద ప్రసిద్ధ సామాజిక కార్యకర్త 'హెలెన్ కెల్లర్' జన్మదినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ కే. హైమావతి జిల్లా అధికారులతో కలిసి హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సమీక్షా సమావేశంలో జెడ్పీ సీఈఓ రమేష్, డిఆర్డీఓ జయదేవ్ ఆర్య, డిపిఓ రవీందర్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకట్ రెడ్డి, డెప్యూటీ సీఈఓ, మిషన్ భగీరథ ఈఈ మరియు వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

# ఒకటే నోటిఫికేషన్.. రెండు రకాల పెన్షన్లు

- ఉపాధ్యాయుల పట్ల తెలంగాణ ప్రభుత్వ వివక్షపై మండిపాటు
- 2003 డీఎస్సీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్

సిద్దిపేట, జూన్ 27 (వుదయం బ్యూరో)



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2003లో విడుదలైన ఒకే నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయుల జీవితాల్లో, రాష్ట్ర విభజన తర్వాత పెన్షన్ విషయంలో తీవ్ర భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని 2003 డీఎస్సీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ ఉపాధ్యాయుల పట్ల మానవతా దృక్పథంతో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం పదివేల మంది ఉపాధ్యాయుల ఆశలపై నీళ్లు చల్లుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ వేయడం దిగ్భ్రాంతి కలిగిస్తోందన్నారు. నోటిఫికేషన్ తేదీని ప్రామాణికంగా తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులందరినీ పాత పెన్షన్ పరిధిలోకి తీసుకువస్తూ ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి తీసుకున్న నిర్ణయాన్ని శేఖర్ కొనియాడారు. తెలంగాణలో ఉన్న పదివేల మంది ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని రాష్ట్ర హైకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ప్రభుత్వం దానిని అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పును గౌరవించాల్సింది పోయి, ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా ప్రభుత్వం సుప్రీంకోర్టులో ప్రత్యేక అనుమతి పిటిషన్ దాఖలు చేసి కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా కుకునూరి శేఖర్ మాట్లాడుతూ ఒకే నోటిఫికేషన్ ద్వారా ఒకే సమయంలో ఉద్యోగాలు పొంది, కేవలం భౌగోళిక సరిహద్దుల కారణంగా ఒక చోట పాత పెన్షన్, ఇంకోచోట కాంట్రిబ్యూటరీ పెన్షన్ పరిధిలో ఉండిపోవడం ఉపాధ్యాయుల పట్ల చూపిస్తున్న వివక్షకు నిదర్శనమన్నారు. న్యాయంగా దక్కాల్సిన హక్కు కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న ఉపాధ్యాయులను మళ్లీ కోర్టుల చుట్టూ తిరిగేలా చేయడం వారిని మానసిక, ఆర్థిక క్షోభకు గురి చేయడమే. విద్యా వ్యవస్థకు వెన్నెముక లాంటి ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ఇప్పటికైనా తన పంథా మార్చుకోవాలి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, హైకోర్టు తీర్పు ప్రకారం సుమారు 10,000 మంది తెలంగాణ ఉపాధ్యాయుల కుటుంబాలలో పాత పెన్షన్ వెలుగులు నింపి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## జిల్లా కేంద్రంలో పల్స్ పోలియో అవగాహన ర్యాలీ

మహబూబ్ నగర్, జూన్ 27 (వుదయం ప్రతినిధి):



పాత జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యలయము నుండి పాన్ చౌరస్తా, లైబ్రరీ, బండ్లగేరి ద్వారా పల్స్ పోలియో అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ ర్యాలీని గుమ్మల మమత నగర మేయర్, జిల్లా వైద్యారోగ్య శాఖధికారి డా. శ్రీనివాసులు తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. 5సం. ల పిల్లందరికి పోలియో చుక్కలు వేయాలని కోరారు. ర్యాలీ ని ఉద్దేశించి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 28న జరిగే పల్స్ పోలియో కార్యాక్రమమునకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయడము జరిగిందని తెలపారు. వైద్యులు, పర్యవేక్షక సిబ్బంది, ఫార్మసీ అధికారులు, ఏ ఎన్ ఎమ్ లు, ఆశ కార్యకర్తలు అందరు సమర్థ వంతముగా విధి నిర్వహణ చేసి పల్స్ పోలియో కార్యక్రమం ను 100 శాతం విజయవంతం చేయాలనీ ఆదేశించారు. జిల్లాలో మొత్తము 05సం. ల పిల్లలు 1,06,208, పి పి ఐ బూతులు (అర్బన్)=93, (రూరల్)=583, మొత్తం బూతులు =676, ట్రాన్సిట్ కేంద్రాలు =18, మొబైల్ టీమ్స్ =24 ఏర్పాటుచేయడము జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఏదేని కారణము చేత ఆదివారం రోజు తప్పిన పిల్లలకు సోమవారం, మంగళవారం ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుందని తెలిపారు. మొత్తం ఇళ్ళు (2,01448) గాను అర్బన్లో (49,595), రూరల్ (1,51,853) వున్నాయి అని తెలిపారు. ఇట్టి కార్యక్రమం లో 54 వ డివిజన్ కార్పొరేటర్ ఫర్హాత్ బేగం, పి ఓ సి హెచ్ ఐ డా. శైలజా, పి ఓ లేప్రసి ,ఎయిడ్స్ డా. రాజు, డా. పులి విద్య, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజు, డా. రాఘవేందర్, యూ పి హెచ్ సి ఎస్ వైద్యాధికారులు డా. తస్లీమా ఫర్హాత్, డా. విజయ్, డా. మమత, డా. ప్రవీణ్, హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు, ఎం పి హెచ్ ఈ ఓ లు సుభాష్ చంద్ర, అశోక్ రాజు, వి సి సి ఎం, శ్రీకాంత్, రమేష్, శ్రీనివాసులు, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ అధ్యాపకులు కల్పన, వంశీ, ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

నారాయణపేట టౌన్, జూన్ 27(వుదయం ప్రతినిధి)

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 202627 విద్యా సంవత్సరంలో బి.ఏ.బీకాం, బిఎస్సి లో చేరేందుకు ఇంటర్మీడియట్, రెండు సంవత్సరాల ఐటిఐ, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్ అదేవిధంగా 10+2 ఉత్తీర్ణులైన వారు అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సమన్వయకర్త భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఇట్టి అడ్మిషన్ కు కావాల్సిన పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ ఫోటో లు తీసుకొని స్థానిక చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లోని అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని సమన్వయకర్త భాస్కర్ రెడ్డి తెలిపారు. ఇట్టి ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ పొందేందుకు చివరి తేదీ 7 ఆగస్టు 2026 వరకు చెల్లించవచ్చని వారు తెలిపారు. అదేవిధంగా రెండో సంవత్సరం మూడో సంవత్సరం ట్యూషన్ ఫీజు చెల్లించుటకు చివరి తేదీ 7 ఆగస్టు 2026 వరకు ఉంది అని ఆయన తెలిపారు.

## పల్స్ పోలియోకు సిద్దిపేట జిల్లా సిద్ధం

- కలెక్టర్ కే. హైమావతి

సిద్దిపేట, జూన్ 27 (వుదయం బ్యూరో)



జిల్లాలో ఆదివారం (జూన్ 28) నిర్వహించబోయే పల్స్ పోలియో కార్యక్రమానికి వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. 'నిండు జీవితానికి రెండు చుక్కలు' అనే నినాదంతో 05 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 94,321 మంది అర్హులైన బాలబాలికలను గుర్తించామని, వారి కోసం 568 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధన్‌రాజ్ నేతృత్వంలో 57 మంది సూపర్వైజర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని చెప్పారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రయాణీకుల పిల్లల కోసం 32 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇటుక బట్టీలు, భవన నిర్మాణ ప్రాంతాలు, సిమెంట్ ఫ్యాక్టరీలు, క్వారీలు మరియు వలస వచ్చిన వారి ప్రాంతాల్లోని పిల్లల కోసం ప్రత్యేక మొబైల్ టీంలను రంగంలోకి దించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చుక్కల పంపిణీ జరుగుతుంది. తదుపరి రెండు రోజులు ఇంటింటికీ.. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన పిల్లల కోసం సోమవారం (జూన్ 29), మంగళవారం (జూన్ 30) రోజుల్లో ఆరోగ్య సిబ్బంది, ఆశా మరియు అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి చుక్కలు వేస్తారని కలెక్టర్ తెలిపారు. గతంలో పోలియో చుక్కలు వేసినప్పటికీ, ఈ ముందస్తు పంపిణీలో మళ్లీ వేయించడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు మరియు అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది సహకరించాలని కలెక్టర్ కే. హైమావతి కోరారు.

## జూలై 9న వర్కింగ్ జర్నలిస్టుల మహాసభ



- జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యాదగిరి, విష్ణు

సంగారెడ్డి:వుదయం

సంగారెడ్డి జిల్లా తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూజెఐజెయు) మహాసభ వచ్చే నెల 9వ తేదీన సంగారెడ్డి లోని టీఎన్జీవో భవన్ లో జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా అర్హులైన వారికి ఇంటి స్థలం తో పాటు హెల్త్ కార్డును ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని ఎప్పటి నుంచో కోరుతున్నామని అన్నారు. ఈ సమస్యలన్నింటిపై చర్చించడానికి జిల్లా మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు. జూలై 9న ఉదయం 11 గంటలకు మహాసభ ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైసల్ తో పాటు సంఘం రాష్ట్ర నేతలు పాల్గొంటారని చెప్పారు. జిల్లా మంత్రి తో పాటు ఎంపీలు ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు కూడా ఈ సమావేశానికి హాజరవుతారని వివరించారు. అందువల్ల జిల్లాలోని జర్నలిస్టులంతా ఈ మహాసభకు తరలి కావాల్సిందిగా కోరారు. జర్నలిస్టుల ఐక్యతను చాటి చెప్పేందుకు సువర్ణ అవకాశమని వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా శాఖ నూతన కమిటీ ఎన్నిక కూడా ఆ రోజు నిర్వహిస్తామని తెలిపారు. అందువల్ల ప్రతి జర్నలిస్టు మహాసభకు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- రూ. 2.16 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మాదాసు శ్రీనివాస్
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ధ్వజం

గజ్వేల్, జూన్ 27 (వుదయం ప్రతినిధి)




అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ పార్టీ నిరంతరం శ్రమిస్తుందని గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను ఆయన శనివారం స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో, ఎమ్మెల్సీ యాదవరెడ్డి సహకారంతో మంజూరైన సుమారు రూ. 2,16,000 విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. బోయిని స్వరూప (రూ. 51,000), కుంట సుమలత (రూ. 60,000), శిగుళ్ల బైరవ్వ (రూ. 47,500), చాకలి భాగ్య (రూ. 21,500), వంక శ్రీనివాస్ (రూ. 21,500), చాకలి కిష్టయ్య (రూ. 14,500) లబ్ధి పొందిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు గ్యారంటీల నెపంతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజే సంతకం చేసిన ఫైలు ఏమైందో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజల్లో అప్పుడే తిరుగుబాటు మొదలైందన్నారు. వానకాలం సీజన్ ప్రారంభమై రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమైనా, ఇప్పటివరకు రైతు భరోసా ఊసే లేదు. రైతులను మరింత కష్టాలపాలు చేసేందుకు 'యూరియా యాప్' తీసుకువచ్చి, అందులో బుక్ చేసుకున్న వారికే ఇస్తామనడం దుర్మార్గ చర్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న రైతుభరోసా, పంట బోనస్, రైతు బీమా అన్నీ బోగస్ అని ఆయన కొట్టిపారేశారు. ఇప్పటికైనా అబద్ధాలు ఆపి అభివృద్ధి వైపు అడుగులు వేయాలని, లేదంటే తెలంగాణ సమాజం క్షమించదని హితవు పలికారు. తెలంగాణ ప్రజలకు కేసీఆర్ నాయకత్వం, బీఆర్ఎస్ పార్టీ మాత్రమే శ్రీరామరక్ష అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బ్యాగారి ప్రభాకర్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామొద్దీన్, నాయకులు చాడా శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, కిష్టారెడ్డి, సింగిరెడ్డి సంపత్ రెడ్డి, నర్సింహారెడ్డి, రామగౌడ్, రాములు గౌడ్, నాంపల్లి, బుచ్చిరెడ్డి, కనకయ్య, బాలయ్య, రమేష్, మోహన్ రెడ్డి, సంజీవరెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## రెండు పోలియో చుక్కలు నిండు జీవితానికి రక్ష

- పల్స్ పోలియోకు సిద్ధం జూన్ 28, 29, 30 తేదీల్లో మెగా డ్రైవ్
- 1,00,624 మంది చిన్నారులే లక్ష్యం
- డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ

నాగర్ కర్నూల్, జూన్ 27 (వుదయం ప్రతినిధి):

జిల్లాలో ఐదేళ్లలోపు 1,00,624 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా జూన్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. కృష్ణ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు. "రెండు చుక్కలు నిండు జీవితానికి రక్ష", "పోలియోను తరిమిద్దాం, పిల్లల బంగారు భవిష్యత్తుకు బాట వేద్దాం" అంటూ వైద్య సిబ్బంది నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.

**కార్యక్రమ వివరాలు**

డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ జూన్ 28 ఆదివారం రోజున జిల్లాలోని 28 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 613 బూత్‌లతో పాటు 18 బస్టాండ్‌లలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి బూత్‌ను స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలని వైద్యాధికారులకు సూచించారు. చిన్నారులను బూత్‌లకు తరలించేందుకు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని కోరారు.

**మొబైల్ బృందాలతో ప్రత్యేక దృష్టి**

వలస కుటుంబాలు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీఫారాలు, నిర్మాణ రంగంలో పనిచేసే కుటుంబాల్లోని 642 మంది చిన్నారుల కోసం 28 మొబైల్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. 61 మంది పర్యవేక్షణ సిబ్బంది మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని తెలిపారు. జూన్ 29, 30 తేదీల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికి వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు చుక్కలు వేస్తారని వివరించారు.

**1.17 లక్షల డోసులు సిద్ధం**

జిల్లాలోని 28 పీహెచ్‌సీలకు 1,17,500 పోలియో టీకా డోసులతో పాటు పోస్టర్లు, బ్యానర్లు, నివేదిక పత్రాలు, మార్కర్లు పంపించామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ సురేష్ కుమార్, కార్యక్రమ అధికారులు డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ ప్రదీప్, ఉప డీఎంహెచ్‌వో డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ వాణి, డాక్టర్ సృజన, ఉప జిల్లా సమాచార అధికారి రాజగోపాలాచారి, ఏపీవోలు బాదం రాజేష్, కొర్ర నిరంజన్, విజయ్ కుమార్, విజయ్, సుకుమార్ రెడ్డి, ఫసియోద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మసీ అధికారులు మల్లిపెద్ది సురేష్ కుమార్, కుమార్, కళ్యాణ కృష్ణారావు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు జులై, 5 లోగా దరఖాస్తులు సమర్పించాలి

- జిల్లా వ్యవసాయాధికారి

సంగారెడ్డి, జూన్ 27:--వుదయం.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా' పథకం కింద అర్హులైన రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ ఒక ప్రకటన లో తెలిపారు. 2026 జూన్ 15 వరకు కొత్తగా పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అర్హత ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జూలై 5, 2026లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు అర్హులైన రైతులు తమకు సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) లేదా మండల వ్యవసాయ అధికారి (MAO) కార్యాలయాల్లో దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీలను, రైతు భరోసా దరఖాస్తు ఫారం ను సమర్పించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన రైతులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని ఆయన కోరారు.




## పశువుల సంత పోస్టర్ ఆవిష్కరణ

నారాయణపేట టౌన్ జూన్ 27(వుదయం ప్రతినిధి)

నారాయణపేట మార్కెట్ యార్డులో పశువుల సంత ను జూలై 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మార్కెట్ యార్డులో సంత పున ప్రారంభం పోస్టర్ ను ఆవిష్కరించారు. రైతుల కోసం పశువుల సంత ను పున ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సంత ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మంజుల జి ఆర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మెన్ కోణంగేరి హన్మంతు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శరణప్ప, సంఘూ, ఎమ్మెల్యే సహాయకుడు చిట్టెం మాధవరెడ్డి, మార్కెట్ కార్యదర్శి బాలమనీ, బి కే ఎస్ నాయకులు వెంకోబ, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డాకూర్ గ్రామంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్



సంగారెడ్డి వుదయం.

సంగారెడ్డి జిల్లా, అందోల్ మండలం డాకూర్ గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయిల్ పామ్ విస్తరణ కార్యక్రమంలో భాగంగా ఈ డ్రైవ్ నిర్వహించబడింది. ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించడం, అధిక విస్తీర్ణంలో మొక్కల నాటకాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాకూర్ గ్రామానికి చెందిన రైతు డాకూరి వెంకటేష్ పొలంలో 5 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. 202627 సంవత్సరానికి సంగారెడ్డి జిల్లాలో 3,000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, ఆ దిశగా జిల్లాలోని వివిధ మండలాల్లో రైతులు మొక్కల నాటకం చేపడుతున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఆయిల్ పామ్ పంట కొనుగోలు చేసే సౌకర్యం ఉండటంతో రైతులు ఈ పంట సాగు వైపు మరింత ఆసక్తి చూపాలని సూచించారు. ఆయిల్ పామ్ రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయకమైన పంట అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు, ఉద్యాన అధికారి టి. సమత, హెచ్ఈఓ సంగయ్య స్వామి, గోద్రెజ్ ఆగ్రోవెట్ ఏరియా మేనేజర్ ఈశ్వర్ రెడ్డి, కంపెనీ ప్రతినిధులు శివరామ్, హర్షతో పాటు అందోల్ మండలానికి చెందిన రైతులు కిరణ్, వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరి పాఠశాల ప్రారంభం

మెదక్ జిల్లా వుదయం





నిజాంపేట మండల పరిధిలోని mpps నస్కల్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ సెక్షన్ ని గ్రామ సర్పంచ్ నాతి అంజమ్మ లక్ష్మా గౌడ్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రభుత్వం చే ప్రీ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు అయినందున ఈ అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పిల్లలను ప్రైవేట్ కి పంపకుండా ఇక్కడే చేర్పించాలని మన బడి మనమే కాపాడుకోవాలని HM సాగరిక తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన వెంకట యోగి సంపత్ కుమార్ 25 మంది పిల్లలకు ప్లేట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ దేవరాజ్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఎల్లం సుమలత, మన్మధ, రాజశేఖర్, జకియా, రాజయ్య, గ్రామ రిటైర్ టీచర్ వెంకటేశం పాల్గొన్నారు.

